రైతు సమస్యల పరిష్కారంలో విఫలం

- హామీల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- రైతు భరోసా వెంటనే అందించాలి
- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు



షాబాద్: ధర్నాలో మాట్లాడుతున్న నాయకుడు కార్తీక్‌రెడ్డి



చేవెళ్లలో ధర్నా చేస్తున్న నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చేవెళ్ల: ఎన్నికల ముందు ఎన్నో మాయమాటలు చెప్పి రైతులు, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అసలు రంగు ఒక్కొక్కటిగా బయటపడుతోందని డీసీఎంఎస్ చైర్మన్ పి.క్రిష్ణారెడ్డి, నియోజకవర్గ నాయకులు దేశమొళ్ల అంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఆదివారం వానాకాలం రైతు భరోసాను ఎగ్గొట్టి రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులను పోలీసులు అరెస్టులు చేసి ధర్నాను విరమింపజేశారు. ఈ ధర్నాలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. రైతు భరోసాకు ఈ ప్రభుత్వం మంగళం పాడుతోందని తేలిపోయిందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు ఉన్న రైతులకు మాత్రం సకాలంలో రైతుబంధు డబ్బులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పంటలకు సకాలంలో అందించిందన్నారు. వానాకాలం రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రోడ్డుపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు సీఐ భూపాల్‌శ్రీధర్, సిబ్బందితో అరెస్టులు చేసి ధర్నాను విరమింపజేశారు. ఈ ధర్నాలో నాయకులు రాజు, తోట చంద్రశేఖర్, రాంప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, మానిక్యరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, అంజనేయులు, మాధవ్‌రెడ్డి, నరహరిరెడ్డి, సురేందర్, భాను, రాజు తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో

షాబాద్: హామీల పేరుతో రైతులను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలో ముంబాయి–బెంగళూరు లింక్ జాతీయ రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అరగంట పాటు ధర్నా, రాస్తారోకో చేయడంతో పోలీసులు వారిని అరెస్టుచేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గూడూర్ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



కొత్తూరు: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రభుత్వ తీరును నిరసిస్తూ..

కొత్తూరు: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండల బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వం తీరును నిరసిస్తూ వారు పట్టణంలో ఆదివారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, సత్యనారాయణ, మధుసూదన్‌రావు, జైపాల్ , ఓంప్రకాశ్, మాధవరెడ్డి, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు ఎత్తివేతకు కుట్ర



కొందుర్గులో ధర్నా చేస్తున్న నాయకులు



శంకర్‌పల్లి చౌరస్తాలో..

కొందుర్గు: రైతుబంధు పథకాన్ని ఎత్తివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఆదివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చరమగీతం పట్టాలని చూస్తోందన్నారు. వానాకాలం పంటలు సాగు చేసి నెలలు గడుస్తున్నా, ప్రస్తుతం పంటలు చేతికందే సమయంలోనైనా రైతుబంధు అందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని, లేనిచో బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాటం చేయడానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సాయం అందించాలి

శంకర్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రైతు భరోసా అందించాలని ఆదివారం పట్టణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నిరసనలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మహేందర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

రైతుభరోసా వెంటనే ఇవ్వాలి



కేశంపేటలో..



మొయినాబాద్‌లో..

మొయినాబాద్: రైతులందరికీ ప్రభుత్వం వెంటనే రైతు భరోసా అందించాలని బీఆర్ఎస్ సీనియర్ నేతలు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో రైతు ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వానికి రైతులే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుధాకర్ యాదవ్, శ్రీహరియాదవ్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు అంజయ్యగౌడ్, గణేశ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పరమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలను హామీలతో నమ్మించి, అధికారం చేపట్టిన తర్వాత మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలో రైతు భరోసాను అమలు చేయాలని డిమాండ్‌తో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, తలసాని వెంకట్‌రెడ్డి, నవీన్‌కుమార్, జామల్‌ఖాన్, కృష్ణయ్య, శేఖర్‌రెడ్డి, పల్లాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రఘునాయక్



మాట్లాడుతున్న రఘునాయక్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రఘునాయక్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు చేపట్టిన బీఆర్ఎస్‌కు గత ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని విమర్శించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను కుర్చీ వేసుకొని కట్టిస్తానని చెప్పిన కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో కొందుర్గుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరైందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్



పూజల్లో పాల్గొన్న బండారి రమేశ్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్ అన్నారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తి భావాన్ని పెంపొందించుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, గజవాడ నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్, ఆలయ ట్రస్టు సభ్యులు ఓం ప్రకాశ్, మహావీర్, సురేందర్, సుదీప్, షుగన్ గోపాల్, కత్తి శేఖర్, అర్చకులు రాజన్‌పండిత్ శుక్లా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



కేశంపేట: సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: మండలంలోని చనువెళ్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం చేవెళ్లలోని జీపీఆర్ ఫాంహౌస్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమకు చదువులు చెప్పిన పూర్వ ఉపాధ్యాయులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, బుచ్చిరెడ్డి, నాగరాజ్, మనోహర్‌రెడ్డి, సున్నపు వసంతం, జనార్దన్‌చారి, రాములు, శ్రీనివాస్‌లు, చనువెళ్లి, పామెన, బస్తేపూర్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిగూడలో..

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సంఘటనలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు స్వామి, వెంకటయ్య, ప్రసాద్, రాధాకృష్ణ, శ్రీశైలంతో పాటు పూర్వ విద్యార్థులు రాజీవ్‌గౌడ్, కేధారేశ్వర్, హన్మంత్, నారాయణ, రవీందర్, జనార్ధన్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ ట్రైసైకిల్ అందజేత



చార్జింగ్ వాహనాన్ని అందజేస్తున్న సబితారెడ్డి

మొయినాబాద్‌రూరల్: మానవత దృక్పథంతో ప్రజలకు సహాయం చేసినప్పుడే వారికి గుర్తింపు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన మంగళారం కృష్ణ షుగర్ వ్యాధితో రెండు కాళ్లు తీసివేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు, నాయకులు మాజీ మంత్రి సబితారెడ్డికి తెలపడంతో ఆమె ఆర్థిక సహాయంతో ఎలక్ట్రిక్ ట్రై సైకిల్‌ను సొంత డబ్బుతో అందజేశారు. నగరంలోని సబితారెడ్డి నివాసంలో ఆయనకు ట్రై సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్, గుత్తి బాల్‌రాజు, నాయకులు సుదర్శన్‌రెడ్డి, షాపురం కృష్ణాగౌడ్, షేక్ నయీం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

తుర్కయంజాల్: వ్యవస్థలో దోపిడీ, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు ఉన్నంతకాలం ప్రజా పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు పగడాల యాదయ్య అన్నారు. ఆదివారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ తుర్కయంజాల్ సెంటర్ కార్యదర్శిగా అరుణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన ప్రకటించారు. ఆ పార్టీ మున్సిపల్ కన్వీనర్ కిషన్, నాయకులు సత్యనారాయణ, శంకర్, ఆశీర్వాదం, వెంకటకృష్ణ, శ్రీరామ్ మూర్తి, శ్రీధర్, జగన్ ఉన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చుక్కమెట్టు గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు అంజయ్య మాట్లాడుతూ.. చుక్కమెట్టు గ్రామానికి ఒక కిలోమీటరు దూరంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడైన అనుకోకుండా కరెంటు సరఫరా నిలిచిపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజు పోయిన వ్యవసాయ పొలాల నుంచి నడుచుకుంటూ వెళ్లి ఫీజు వేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఈ విషయమై చుక్కమెట్టు గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి కరెంటు లైన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడానికి ఆదేశించారు. ఎమ్మెల్యే సూచన కోసం ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా చుక్కమెట్టు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ద్విజేందర్, కాంతం రెడ్డి, శ్రీశైలం, రవి, శివకుమార్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా ఉత్తమ బిల్డర్స్‌గా నిఖిల డెవలపర్స్



అవార్డు అందుకుంటున్న ఎన్‌సీడీ చైర్మన్ శ్రీనివాసరావు

శంకర్‌పల్లి: ఇటీవల దుబాయ్‌లో ఏషియా టుడే ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇండో అరబ్ లీడర్స్ సమ్మిట్ అవార్డ్స్–2024"లో సౌత్ ఇండియా ఉత్తమ బిల్డర్స్‌గా ఎన్‌సీడీ (నిఖిల కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలపర్స్) ఎంపికైంది. ఈ మేరకు నిర్వాహకులు ఎన్‌సీడీ చైర్మన్ శ్రీనివాసరావుకు అవార్డు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాము చేపట్టిన ఏ ప్రాజెక్టు అయినా అత్యుత్తమ డిజైన్‌తో పాటు, వేగంగా, నాణ్యతతో ఉంటుందన్నారు. ప్రస్తుతం శంకర్‌పల్లి మండలం మోకిలలో నిర్మిస్తున్న రాయల్ పెవిలియన్‌లో 4 అంతస్తుల్లో పోడియం పార్కింగ్ వ్యవస్థ ఉందని, దీంతో వర్షాలు పడినప్పుడు కార్లకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, విద్యుత్ వినియోగం సైతం తక్కువగా ఉంటుందన్నారు. తమ నాణ్యతను గుర్తించి, అవార్డు అందించిన ఏషియా మీడియా వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చేగిరెడ్డి ఘనాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కోటమైసమ్మ దేవాలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. గ్రామస్తులందరూ కలిసి ఐకమత్యంతో ముందుకొచ్చి దేవాలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణ రెడ్డి, శివమౌళి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు సన్మానం

తుక్కుగూడ: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బరిగెల హేమలతరాజుగౌడ్‌ను ఆదివారం రావిర్యాల గ్రామంలోని సర్దార్ పటేల్ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ వై.శివకుమార్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్



చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. మున్సిపాలిటీకి చెందిన మాధవి అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంది. దీంతో ఆర్థిక సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి చొరవతో మంజూరైన రూ.22,500వేల చెక్కును ఆదివారం కౌన్సిలర్ ఆమెకు అందజేశారు.

నిరుపేదల ఆకలి తీర్చడం అభినందనీయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: తక్కువ ఖర్చుతో నిరుపేదల ఆకలి తీర్చేందుకు విశ్రాంత ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణానికి చెందిన పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు అన్నపూర్ణాలయాన్ని ఏర్పాటు చేసి గత రెండేళ్లుగా పేదల కోసం రూ.10లకే భోజనాన్ని అందజేస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే తనవంతు సహాయంగా ఏడాది పాటు భోజన కార్యక్రమానికి రూ.1లక్ష విరాళానికి సంబంధించిన చెక్కును నిర్వాహకులను అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు సమాజాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం కృషి చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు విశ్వం, పురుషోత్తంరెడ్డి, టీజీ శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి



సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభను పెద్దఎత్తున మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలని రిటైర్డు డీఎస్పీ యాదయ్య, మాల సంఘం జిల్లా ఇన్‌చార్జి రవీందర్‌లు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మాలల ఆత్మగౌరవ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా ఈ హలో మాల చలో మాల పేరుతో మాలల ఆత్మగౌరవ సభను నాగర్‌కర్నూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను పెద్దఎత్తున మాలలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సభ ఇన్‌చార్జులుగా చేవెళ్ల ఎం.రామస్వామి, వికారాబాద్ బి.రాజు, పరిగి వెంకటయ్య, యాదయ్యలను ఎంపిక చేశామన్నారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల మల్లేశ్, చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్, మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, షాబాద్ అధ్యక్షుడు కృష్ణ, మాల సంఘాల సభ్యులు విజయ్, మల్లేశ్, నరేశ్, ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మాడ్గుల: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహాసభలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యురాలు మల్ల సైదమ్మ పిలుపునిచ్చారు. అదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నేటి నుంచి జరిగే మహాసభలకు జాతీయ, ప్రాంతీయ నాయకులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.